ప్రజాశక్తి
మంగళవారం 21 ఫిబ్రవరి 2023
5
పార్వతీపురం మన్యం



24న మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 24న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. రైతులను, కార్మికులను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న చేపట్టే నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నిరసనలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు, వి.ఇందిర, గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

గిరిజనుల 'చింత' దళారుల చెంత



- గిట్టుబాటు కాని చింతపండు ధర
- కొనుగోలు చేయని జిసిసి
- దళారుల చేతిలో మోసపోతున్న గిరి రైతులు

గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా గిరిజన సహకార సంస్థను ఏర్పాటు చేసింది. చింతపండు, అడ్డాకులు, పసుపు, అల్లంతో పాటు పలు రకాల అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, దళారులు, ప్రైవేటు వ్యాపారుల నుంచి గిరిజన రైతులను రక్షించేందుకు జిసిసి ఏర్పాటైంది. అంత వరకు బాగానే ఉన్నా జిసిసి తన లక్ష్యాన్ని మర్చిపోయి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మానేసింది. దీంతో గిరిజన రైతులు దళారులు, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోతున్నారు. దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తమకు నచ్చిన విధంగా ధర నిర్ణయించి మార్కెట్ కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేసి, మైదాన ప్రాంతానికి తరలించి లాభాలను ఆర్జిస్తున్నారు. ఎంతో కష్టపడి సేకరించిన పంటలకు మద్దతు ధర రాకపోవడంతో వారు దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా జిసిసి అధికారుల్లో చలనం లేకపోవడం విచారకరం.



కురుపాం లో గిరిజనుల వద్ద వ్యాపారులు కొనుగోలు చేసిన చింతపండు

ప్రజాశక్తి - కురుపాం

మండలం కేంద్రమైన కురుపాంలో దళారులు కిలో చింతపండు రూ.23 ధరకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది రూ.32 కొనుగోలు చేయగా, ఈ ఏడాది గిరిజనులు కిలో దగ్గర రూ.9 గిరిజనులు నష్టపోయారు. గ్రామాల్లోకి వచ్చి అతి తక్కువ ధరకు చింతపండును కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు దళారులు తూకాల్లో మోసాలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలు, ధర్మ కాటాలను ఉపయోగించినా అందులోనూ మోసం జరుగుతోంది. చింతపండును జిసిసి కొనుగోలు చేయకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దళారులు, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అమాయక గిరిజన రైతులు నష్టపోతున్నారు.

పెరిగిన చింతపండు దిగుబడి

గతేడాది కన్నా ఈ ఏడాది చింతపండు దిగుబడి బాగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సగానికి సగం పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. దిగుబడి పెరిగినా చింతపండు ధర మాత్రం పెరగడం లేదని, గత ఏడాది కన్నా ధర తక్కువగా ఉండడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారులే దిక్కు

చింతపండును జిసిసి కొనుగోలు చేయకపోవడంతో ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులే గిరిజనులకు దిక్కుగా మారుతున్నారు. గిట్టుబాటు ధర లేక పోయినా తూకాల్లో మోసాలు జరుగుతున్నా తప్పని పరిస్థితిలో వారికే విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులంతా నాలుగైదు రోజులు కష్టపడి సేకరించిన చింతపండుకు గిట్టుబాటు ధర రావడం లేదంటూ రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి, జిసిసి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిసిసి కొనుగోలు చేసి గిరిజనులు ఆదుకోవాలి

అటవీ ఫలసాయాల కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడం వల్ల గిరిజనులు ప్రైవేట్ దళారుల చేతుల్లో మోసపోతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి జిసిసి ద్వారా చింతపండు కొనుగోలు చేసి గిరిజనులను ఆదుకోవాలి.



ఎం. శ్రీనివాసరావు
గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

జిసిసి అభివృద్ధికి

రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిసిసి కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిసిసి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలను కల్పించాలని కోరారు. కిలో చింతపండు రూ.50కు కొనుగోలు చేయాలన్నారు. కొండచీపుర్లను రూ.80కు కొనుగోలు చేసి దళారుల నుంచి కాపాడాలన్నారు. గిరిజనులు పండిస్తున్న జీడిపిక్కలను కిలో 200 రూపాయలకు కొనుగోలు చేసి, గిరిజన ప్రాంతాల్లో జీడి ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు కొండ ప్రాంతాల్లో కష్టపడి నిత్యం సేకరిస్తున్న పలు రకాల అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం నాయకులు పి. తిరుపతిరావు, బిడ్డిక శంకర్రావు, బిడ్డిక ఆడితో, బి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం జిసిసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు



సీతంపేట జిసిసి వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

సీతంపేట : అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక జిసిసి కార్యాలయం వద్ద ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ముందుగా గిరిజన సంఘం కార్యాలయం నుంచి జిసిసి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి హారిక గంగాధర్, ఐటిడిఎ ఏరియా అధ్యక్షులు బి.అప్పారావు మాట్లాడుతూ ఏజెన్సీలో దళారులు సాగిస్తున్న దోపిడీని నిరోధించేందుకు ఏర్పాటైన గిరిజన సహకార సంస్థ మద్దతుధర ఇవ్వడం లేదన్నారు. గిరిజనులు గత్యంతరం లేక మోసానికి, దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. స్వచ్ఛమైన ఉత్పత్తులు కావడంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. గిరిజన సహకార సంస్థ మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిసిసి మేనేజర్ దాసరి కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ ధరల సమస్యను ఎమ్‌డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీరాములు, బాపన్న తదితరులు పాల్గొన్నారు.

రమాప్రభను గెలిపించాలని ప్రచారం

సీతానగరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు జి.వెంకటరమణ, జి.జ్యోతి, ఆర్.ఈశ్వరరావు, ఆర్.రాము, ఆర్.లక్ష్మునాయుడు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో వారు ప్రచారం చేపట్టారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై, ప్రజా సమస్యలపై గొంతెత్తి పరిష్కరించే దిశగా పిడిఎఫ్ అభ్యర్థి కృషి చేస్తారని వారు తెలిపారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమే

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గంలో ఏ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నానని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం మండలంలోని గంగన్నదొరవలస నుంచి కురుకుట్టి వరకు రూ.5 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు జరిగాయని చెప్పారు. మళ్లీ వైసిపి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో 150 రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. నియోజకవర్గంలో 20 రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధిపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఏ అభివృద్ధి పనులు జరిగాయో టిడిపి నాయకులు చర్చకు రావాలని అనేకసార్లు సవాల్ చేసినట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. టిడిపి నాయకులు పనికి మాలిన విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. ఆయన వెంట వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, ఇతర నాయకులు ఉన్నారు.

స్పందనకు 85 దరఖాస్తులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 85 దరఖాస్తులు అందాయి. కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన కలెక్టర్ తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అర్జీల్లో కొన్ని..

గుమ్మలక్ష్మీపురం మండలం మంత్రజోల గ్రామంలో 120 కుటుంబాలు ఉన్నాయని, రెండు వందలకు పైగా విద్యార్థులు ఉన్నారని, గ్రామానికి రోడ్డు సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నామని, బిటి రోడ్ మంజూరు చేయాలని పి.కామేశ్వరరావు, తదితరులు దరఖాస్తు అందజేశారు.

బలిజిపేట మండలం వెంగళరాయపురం గ్రామానికి చెందిన జి.సన్యాసి, గ్రామస్తులు తాము సాగు చేస్తున్న ఇనాం భూములకు ప్రభుత్వ అధికారులు డి-పట్టా ఇచ్చారని, రైతు వారి పట్టా మంజూరు చేయాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం మండలం డమ్మంగి పంచాయతీ పరిధిలో కోసంగి భద్ర, టెంకసింగి, కొరటిగూడ గ్రామాల్లో పాఠశాలలకు పునాదులు వేసి వదిలేశారని, వాటిని త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిడి ఎంపిటిసి కె.మల్లేశ్వరరావు వినతి పత్రం అందజేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గొట్టివలస గ్రామ రెవెన్యూలో ఉన్న కొండపైన భాగంలో జీడి, టేకు మొక్కలను వేసి సాగు చేసుకుంటున్నామని, ఈ కొండకు డి-పట్టాలు 8 విడతలో ఇస్తారని రెవెన్యూ అధికారులు చెప్పినా ఇవ్వలేదని గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఆ కొండకు రెవెన్యూ అధికారులు కొలతలు వేసి అది ప్రభుత్వ స్థలమని చెబుతున్నారని వాపోయారు. సాగు చేస్తున్న కొండపై తమకు డి-పట్టాలు ఇప్పించాలని విన్నవించారు.

పార్వతీపురం పట్టణంలోని నాయుడు వీధికి చెందిన పి వెంకటరమణ జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకానికి రూ.15 వేలు చెల్లించానని, తనకు ఇంటి పట్టా ఇప్పించాలని కోరారు.

మక్కువ మండలం బట్టివలస గ్రామానికి చెందిన వి.వెంకట్రావు, రైతులు తమ వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.


పార్వతిపురం మండలం ఎస్‌టి లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి.చిన్నరావు జమదాల రెవెన్యూలో సుమారు 60 సెంట్లు జీడి తోటను సాగు చేస్తున్నామని, ఆ భూమికి డి-పట్టా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నిబంధనలు

కలెక్టరేట్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పలు చోట్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. ఉల్లంఘనపై ఎటువంటి ఫిర్యాదు వచ్చినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు అందుకు అనుగుణంగా నడుచుకోవాలని, పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సురేష్‌బాబుకు మరో ఛాన్స్

ఎమ్మెల్సీగా మళ్లీ అవకాశం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పెనుమత్స సూర్య నారాయణరాజు (సురేష్‌బాబు)కు ఎమ్మెల్సీగా మరో ఛాన్స్ దక్కింది. స్థానిక సంస్థలు, ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల అభ్యర్థుల జాబితాను వైసిపి నాయకులు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం ప్రకటించారు. అందులో ప్రస్తుతం మన జిల్లా నుంచి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా వున్న సురేష్‌బాబు పేరును ఖరారు చేసినట్టు పేర్కొన్నారు. వాస్తవానికి ఆయన పదవీ కాలంలో మార్చి 29వ తేదీ వరకు ఉంది. ఆ తరువాత కొత్తగా ఎన్నికలు జరగనున్నాయి. దీనిపై కసరత్తుచేసిన వైసిపి అధిష్టానం నెల రోజులు ముందే జాబితాను ప్రకటించింది. ఎమ్మెల్సీ కోటాలో సురేష్‌బాబుకు మరోసారి అవకాశం దక్కడం పట్ల ఆయన అనుచరుల్లో హర్షం వ్యక్తమౌతోంది. పదవీ కాలంలో వివాద రహితుడిగా, సౌమ్యుడిగా సురేష్‌బాబు పేరొందారు. ఈయన తండ్రి కీర్తిశేషులు పెనుమత్స సాంబశివరావు తండ్రి జిల్లాలో ఒకప్పుడు కాకలు తీరిన నాయకుడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక సార్లు మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్‌ను వీడి వైసిపి ఆవిర్భావం నుంచీ జెండా పట్టుకున్నారు. ఆయన మరణం తరువాత సురేష్‌బాబుకు వైసిపి అధినేత సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. మరోసారి ఎమ్మెల్సీగా పేరును ఖరారు చేయడం విశేషం.

జిల్లా ఆస్పత్రిలో ట్రైబల్ సెల్‌ను ఏర్పాటు చేయాలి

పార్వతీపురం రూరల్ : వైజాగ్ కెజిహెచ్ మాదిరిగానే పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలనిగిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ కు వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని 8మండలాల్లో గిరిజనులకు వైద్య సదుపాయం కల్పించేందుకు వీలుగా ఉంటుందని పిఒ దృష్టికి తీసు తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి తక్షణమే సెల్ ఏర్పాటుకు హామీ ఇచ్చారని తెలిపారు.

ధాన్యం బస్తాలతో రోడ్డుపై నిరసన

ప్రజాశక్తి - భామిని

సత్వరమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలంటూ, పెద్దదిమిలి సమీపంలో ప్రధాన రహదారిపై పెద్దదిమిలి, చిన్నదిమిలి, కేశర, ఘనసరా రైతులు ట్రాక్టర్లతో ధాన్యం బస్తాలు వేసుకొని రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ పెట్టి రాస్తారోకో చేశారు. గత రెండు నెలలు కళ్లాల్లో ధాన్యం ఉన్నాయని, వీటి కొనుగోలుకు వ్యవసాయ సిబ్బంది వద్దకు, ఆర్‌బికెలకు వెళ్తే స్పష్టమైన సమాధానం లేదని అన్నారు. దీంతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదోనని తమలో ఆందోళన మొదలైందన్నారు. ప్రభుత్వం త్వరితంగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు నినదించారు. రైతులు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ నిలిపివేయడంతో వాహనాలు సుమారు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. అదేమార్గంలో వస్తున్న సామజిక కార్యకర్త పడాల భూదేవి, రైతులు సంఘీభావం తెలుపుతూ, మండల అధికారులు సంప్రదించారు. మండల అధికారులు స్పందన లేకపోవటంతో సబ్ కలెక్టర్‌ను ఫోన్ సంప్రదించి ధర్నా అంశం తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయాధికారి కె.సింహాచలం, ఎస్ఐ అమ్మన్నారావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ధర్నా విరమించకపోతే కేసు పెడతామని ఎస్ఐ బెదిరించినా రైతులు ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు హామీ ఇచ్చేంత వరకు ధర్నా విరమించేది లేదని పట్టుబట్టారు. దీంతో ఎఒ ధాన్యం కొనుగోలుకు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ పెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

పాలకొండ: గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ధాన్యం కొనుగోలు చేయకపోవడం పట్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్న ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాలవలస దవళేశ్వరరావు, సర్పంచులు వావిలపల్లి రాజారావు, లోలుగు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

సిసి కెమెరాల పర్యవేక్షణలో నిర్వహణ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఒకేషనల్ విభాగానికి సంబంధించి ప్రయోగ పరీక్షలు పట్టణంలోని శ్రీగాయత్రి, శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ప్రథమ సంవత్సరం ప్రయోగ పరీక్షలకు గానూ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 46 మంది విద్యార్థులకు గాను 40 మంది హాజరయ్యారు. 6 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షల్లో 23 మంది విద్యార్థులకు గాను 21 మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయినట్లు చీఫ్ సూపరెంటెండెంట్ వెలమల అప్పారావు తెలిపారు. శ్రీ గాయత్రి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర పరీక్షలకు 103 మంది విద్యార్థులకు గానూ 102మంది విద్యార్థులు హాజరు కాగా, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన 90 మందికి 90 మంది హాజరైనట్లు చీఫ్ సూపరెంటెండెంట్ ఉరిటి జగదీశ్వరరావు తెలిపారు. క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్మెంట్, ఎంపిహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టి, లైవ్ స్టాక్ మేనేజ్మెంట్, డైరీయింగ్, ఫిషరీస్, సిఎస్ఇ సబ్జెక్టులకు గాను ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి.

పరీక్షల నిర్వహణ సభ్యుల తనిఖీ...

పాలకొండ పట్టణంలో సోమవారం ప్రారంభమైన ఇంటర్ ప్రయోగ పరీక్షలను పరీక్షల నిర్వహణ అత్యున్నత కమిటీ సభ్యులు పి.అప్పల రాము, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు డి.ఫల్గుణరావు పరిశీలించారు. పరీక్షలను సిసి కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేలా పరీక్షా నిర్వహణ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. సిసి కెమెరాలన్నింటినీ ఆన్లైన్ స్ట్రీమింగ్ చేశారు. అలాగే ప్రతి కేంద్రాన్ని సెల్‌ఫోన్ రహిత జోన్‌గా అధికారులు ప్రకటించారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు, శ్రీకాకుళం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి శివ్వాల తవిటినాయుడు సూచన మేరకు పరీక్ష కేంద్రంలో నిర్దేశిత ఏర్పాట్లను పరీక్షల నిర్వహణ సభ్యులు పరిశీలించారు. పరీక్షలు మరింత కట్టుదిట్టంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.



104 వాహనంపై ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బొమ్మ

వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా?

ప్రజాశక్తి-వీరఘట్టం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఇప్పటికే అధికారులు వివిధ రకాల పార్టీల బ్యానర్లు తొలగించారు. బొమ్మలకు ముఖంపై పేపర్లు అంటించారు. ప్రజలకు అత్యవసర సేవలందిస్తున్న వాహనాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బొమ్మను మాత్రం తొలగించలేదు. దీంతో వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా? అంటూ స్థానికులు అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు.



స్వర్ణ పతకం సాధించిన విద్యార్థితో పాఠశాల సిబ్బంది

గిరిజన విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ధర్మలక్ష్మిపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి ఆరిక రంజిత్‌కుమార్ అండర్-14 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. గుంటూరు జిల్లా నరసరావుపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో రంజిత్ సత్తాచాటాడు. రంజిత్‌ను ప్రధానోపాధ్యాయుడు కె.అక్కిన అభినందించారు. కార్యక్రమంలో వసతిగృహ సంరక్షణ అధికారి ఎం.రాజేంద్రప్రసాద్, పీడీలు ఎ.సన్యాసిరావు, పి.బోగేష్ పాల్గొన్నారు.

రావాడ విద్యార్థుల ప్రతిభ

భోగాపురం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో మండలంలోని రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఈ నెల 14 నుండి 16వరకు పల్నాడు జిల్లా నర్సరావుపేటలో అండర్-14 బాల బాలికల వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్. సంపత్ గణేష్, బాలికల జట్టులో పి. ప్రణీత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని స్కూల్ హెచ్‌ఎం బి. శైలజారాణి, పీడీ చిన్నారి, ఉపాధ్యాయులు అభినందించారు.



అక్షిత్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అక్షిత్‌కుమార్ ప్రతిభ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో పార్వతీపురం మండలం బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుర్ల అక్షిత్‌కుమార్ గణిత విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అక్షిత్ అభినందించారు. ప్రధానోపాధ్యాయులు డి.శ్యామసుందరరావు మాట్లాడుతూ గణిత విభాగంలో రాష్ట్ర స్థాయికి అక్షిత్‌కుమార్ అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ నెల 28న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొంటాడని చెప్పారు.

స్మార్ట్ కార్డుల కోసం డబ్బుల వసూళ్లు ఆపాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్

పట్టణంలో సుమారు 1200 మహిళా సంఘాల నుంచి మహిళా మార్ట్ స్మార్ట్ కార్డుల కోసం సుమారు రూ.18 లక్షల వసూళ్లకు పూనుకోవడంపై పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు.. స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఎంతో ఆర్భాటంగా మహిళా మార్ట్‌లు ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించి ఇలా మహిళల వద్ద నుండి షేర్ క్యాపిటల్ రూపంలో డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేట్ ప్రపంచంలో మహిళలు వ్యాపారంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం సబ్సిడీ రేట్లకు సరుకులను అందజేసి, మార్కెట్లో విక్రయించేలా నిబంధనలు రూపొందించి మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల నుండి డబ్బులు వసూళ్లకు పాల్పడటం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

అటవీ ఉత్పత్తులను గిరిజన సహకార సంస్థ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు జిసిసి ఎంఎల్‌ఎస్ ఇన్‌ఛార్జి ఎం.సాంబశివరావు తెలిపారు. సోమవారం మండలంలో మొండెంఖల్ డిపో పరిధిలోని మరిపల్లి గ్రామంలో గిరిజనులకు జిసిసిలో కొనుగోలు చేసే అటవీ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్, మేనేజర్ వి.కృష్ణప్రసాద్ సూచనల మేరకు గిరిజన ప్రాంతంలో పండిన చింతపండు, కొండ చీపురులు తదితర అటవీ ఉత్పత్తులు జిసిసి ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. దీనిపై ముందస్తుగా గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



గిరిజనులతో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం

దుడ్డుఖల్లులో 'చేయి చేయి కలుపుదాం'

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

'చేయి చేయి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం' అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో సోమవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. దుడ్డుఖలు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న నేపథ్యంలో కూలీల దగ్గరకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కురుపాం నియోజకవర్గ అధ్యక్షులు కోలక సుమన్, సర్పంచ్ నిమ్మక నీలావతి, వార్డు సభ్యులు జి.మహేశ్వరరావు, పాడి పాపారావు, కె.చందు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

యుహెచ్‌సి భవనం ఎప్పటికి పూర్తయ్యేనో?

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా భవనాలను మంజూరు చేసింది. అయితే ఏడాదిన్నర కావస్తున్నా భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అద్దె భవనాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. యుహెచ్‌సి భవన నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం రూ.80 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. తమ్మినాయుడు కళాశాల పక్కన పనులు మాత్రం అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఒక వైపు అర్బన్ హెల్త్ సెంటర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రారంభించి రోగులకు వైద్య సేవలు అందించాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కిందిస్థాయి అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యం వహించడంతో నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్ అద్దె భవనంలో నడుస్తోంది. అది కూడా నివాస గృహం కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న మందులు, సామగ్రి ఉంచేందుకు స్థలం సరిపోవడం లేదు. మరోవైపు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేలకు వేలు భవనాలకు అద్దెలు చెల్లిస్తున్నా పూర్తి స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నివాసంలో నడపడం వల్ల మున్సిపాలిటీ ప్రజలకు అర్బన్ హెల్త్ సెంటర్ ఉందా? అనే విషయమూ తెలియని పరిస్థితి. అర్బన్ హెల్త్ సెంటర్‌కు పక్కా భవనం లేకపోవడం వల్లే ఇటువంటి ఇబ్బందులు వస్తున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. త్వరితగతిన అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా కాంట్రాక్టరుతో మాట్లాడి భవనం పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.



నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

గిరిజన సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన సమస్యలు పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో పలువురు వినతులు సమర్పించారు. సోమవారం గిరిజన స్పందన కార్యక్రమాన్ని ఐటిడిఎలో ఎపిఒ రోషిరెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. డెప్పి గూడకు చెందిన సవర సుక్కమ్మ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని వినతి సమర్పించారు. పెదరామకు చెందిన గణపతిరావు సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. పాలిష్‌కోటకు చెందిన సురేష్ ఆటో లోన్ మంజూరు చేయాలని విన్నవించారు. మామిడిజోలకు చెందిన నారాయణ కంప్యూటర్ కాటా ఇప్పించాలని కోరారు. కొండారుకు చెందిన సుజ్జిరావు తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి అందించారు. రంగంవలసకు చెందిన పెంటయ్య ఆర్ఒఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని కోరారు. దోనుబాయి చెందిన కోటేశ్వరరావు వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. చిన్నగోరకు చెందిన సోంబాబు వ్యవసాయ ట్రాక్టర్ మంజూరు చేయాలని కోరారు. ఈతమానుగూడకు చెందిన ప్రియాంక ధాన్యం కొనుగోలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డిఇ కృష్ణకూమార్, సిడిపిఒ రంగలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఎఎంఒ కోటి బాబు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ రోషిరెడ్డి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

జగనన్న అర్బన్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన ఛాంబర్‌లో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసేలా చూడాలన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

శిథిలావస్థలో ఆర్అండ్‌బి బంగ్లా

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రంలో సీతంపేట రహదారిలో ఉన్న ఆర్అండ్‌బి బంగ్లా శిథిలావస్థకు చేరింది. గతంలో ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ విశ్రాంతి తీసుకొనేవారు. గతంలో ఈ బంగ్లాలో అటెండర్, వాచ్‌మెన్ ఉండే వారు. కొన్నేళ్లుగా సిబ్బందిని నియమించకపోవడంతో బంగ్లా ఆలనాపాలనా చూసేవారు లేక శిథిలావస్థకు చేరుకుంది. పూర్తి నిర్లక్ష్యంగా విడిచిపెట్టడంతో కీటకాలకు, విషసర్పాలకు నిలయంగా మారింది. దీని చుట్టూ ఉన్న కోట్ల రూపాయలు విలువైన ఖాళీ స్థలం వృథాగా పడి ఉంది. అధికారులు స్పందించి ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి, కొత్త భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ఆర్అండ్‌బి అతిథి గృహం

ఏనుగుల సంచారంతో ఆందోళన

ప్రజాశక్తి - వీరఘట్టం


మండలంలోని నడుకూరు, కిమ్మి, వీరఘట్టం గ్రామాల పరిధిలో గత నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు గజ గజ వణికి పోతున్నారు. వీటి సంచారం కారణంగా ప్రజలు, రైతులు, ఉపాధి కూలీలు పనులు చేసేందుకు వెళ్లలేక తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ఈనెల 17న విజయనగరం జిల్లా వంగర నుంచి వీరఘట్టం మండలంలోని కిమ్మి గ్రామం మీదుగా నడుకూరుకు చేరుకొని ఎం.సన్యాసినాయుడు అనే రైతు చెరుకు తోటలో బస చేశాయి. ఈనెల 19న రాత్రింతా వీరఘట్టంకు చెందిన రమేష్ దాస్ మామిడితోటలో బసవేసి సోమవారం ఉదయం ఐదున్నర గంట సమయంలో చిట్టిపూడివలస వైపు ఉన్న కిమ్మి గ్రామానికి చెందిన వాన దాము అనే రైతు చెరుకు తోటలో బసవేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి చప్పుడు, శబ్దాలు లేకుండా ప్రశాంతంగా ఏనుగుల గుంపు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతానికి ఏనుగులు గుంపు వద్దకు ఎవర్నీ రానీయకుండా పోలీసులు, అటవీ శాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఈ గుంపు 500 మీటర్ల దూరంలో ప్రయాణం తప్ప మరి ఎక్కువగా ప్రయాణం చేయవని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ గుంపును విడిచి వెళ్లిన హరి ఏనుగు కొమరాడ మండలం పాత గుణానపురం, పాత దుగ్గి గ్రామాల మధ్య నది తీరంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ డిఆర్ఒ పి.రవిబాబు తెలిపారు. వీటి కదలికల గురించి ఏనుగులున్న చుట్టూ ఐదుగురు ట్రాకర్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వీరఘట్టం, కిమ్మి గ్రామాల మధ్య ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బాలేరుకు చెందిన ములగాం చంద్రరావు (25) బోన్ మారో కేన్సర్‌తో వైద్యం చేసుకుంటూ ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2లక్షలు చెక్కును ఎమ్మెల్యే వి.కళావతి వండువలోని తన క్యాంపు కార్యాలయంలో చంద్రరావు తండ్రి అయిన సంజీవురావుకు అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, వి.చిరంజీవులు, బోడలా చిన్నయ్య దొర, రైతుమిత్ర వడ్డివాడ చిన్నారావు, వాలంటీరు కృష్ణ ఉన్నారు.



మృతుని తండ్రికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ప్రకృతి సాగు సిబ్బందికి జీతాలివ్వండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జనసేన పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, బంటు శిరీష్.. ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్‌ను కోరారు. తదితరులు కలిసి ప్రకతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు జీతాలు పై చర్చించారు. 270 మంది ఉద్యోగులకు గతేడాది ఏప్రిల్ నుండి జీతాలు చెల్లించకపోతే వారు ఏ విధంగా బతుకుతారని ప్రశ్నించారు. స్పందించిన పిఒ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు డిఇసి మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం బోదకాలు నివారణకు డిఇసి మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.రేణుక మాట్లాడుతూ 166 మంది విద్యార్థులకు మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి.రవికుమార్, డి.రామకృష్ణ, రామారావు, వినోద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ముందుగానే 'ఫ్యామిలీ డాక్టర్' షెడ్యూల్

డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వివరాలను గ్రామాల్లో ముందుగా తెలియ జేయాలని డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. సోమ వారం మండలంలోని నడుకూరు గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్‌ను, కేస్ స్టడీ షీట్లను పరిశీలించారు. వైద్య శిబిరం వద్దకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడారు. వైద్య సేవలు, మందులు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్యానికి వచ్చిన రోగులకు ప్రేమ ఆప్యాయతతో వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, డెమో వై.యోగేశ్వర రెడ్డి, సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం సరస్వతి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ బి జగన్నాథరావు

విలేకరి శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్, రూరల్

పట్టణంలోని బెలగాం ప్రాంతానికి చెందిన విశాలాంధ్ర విలేకరి జన్నేటి శ్రీనివాసరావు (45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించారు. అనంతరం జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు జిల్లా అసుపత్రికి చేరుకుని శ్రీనివాసరావు భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని శ్రీనివాసరావు స్వగ్రామం గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు తరలించేందుకు అవసరమైన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే దగ్గరుండి ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు పాల్గొన్నారు. శ్రీనివాసరావు మృతికి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఉద్దవోలు వెళ్లి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మృతికి ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.



శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కాయ తొలుచు పురుగుతో పంట నష్టం

ప్రజాశక్తి-పాచిపెంట

పత్తి పంట జనవరి తర్వాత కొనసాగిస్తే గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఆశించి, ఖరీఫ్‌లో ఉధృతమై పంటను నష్టపరిచే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. సోమవారం మండలం లోని అమ్మవలస గ్రామంలో నిర్వహించిన వైఎస్ఆర్ పొలంబడి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండిపోయిన పత్తి పంటను రోటోవేటర్ సహాయంతో కలియ దున్నేయాలని చెప్పారు. లేదంటే గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఆశించి, రాబోయే ఖరీఫ్ సీజన్లో బయటపడి పంటను నష్టపరిచి గుడ్డి పత్తి తయారవుతుందని తెలిపారు. గులాబీ రంగులోకి మారి పత్తి నాణ్యత దెబ్బతింటుందన్నారు. రైతులు పత్తి మోడులను రోటోవేటర్ సహాయంతో కలియదున్నాలని, గుడ్డి పత్తి పువ్వులను ఏరి తగలబెట్టాలని సూచించారు. అనంతరం మొక్కజొన్న పంటలో వచ్చిన రసం పీల్చు పురుగులను చూపించి నివారణ చర్యలను సూచించారు. అనంతరం ఎపిసిఎన్ఎఫ్ ప్రతినిధుల ద్వారా ద్రవజీవామృతం తయారీని వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు యశోద, తిరుపతినాయుడు, బాలకృష్ణ, విఎఎ మోహనకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

పార్వతీపురం రూరల్ : గతేడాది అక్టోబర్ 18న పార్వతీపురం పట్టణంలోని సారికవీధిలో షేక్ రఫీ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నేరస్తులను టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ వివరాలను వెల్లడించారు. స్థానిక ఇందిరా కాలనీకి చెందిన సొండి శ్రీధర్, ఆయన స్నేహితుడు దేవుపల్లి నవీన్, మరొక వ్యక్తి కలిసి గతేడాది అక్టోబర్ 18న రాత్రి వారాలు పండగ పూర్తయ్యాక షేక్ రఫీ ఇంటికి సరిగా తాళాలు వెయ్యకుండా నిద్రిస్తున్న విషయం గమనించారు. మూడో వ్యక్తిని కాపలాగా ఉంచి, వీరిద్దరూ ఇంట్లో చొరబడి, బంగారు వస్తువులు, డబ్బు, సెల్‌ఫోన్ దోచుకొని, పరారయ్యారు. సిసిఎస్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఇచ్చిన సమాచారం ఆధారంగా, సోమవారం టౌన్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి చోరీ సొత్తు, రెండు బంగారు ఉంగరాలు, చెవి దుద్దులు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మూడో వ్యక్తి, మరికొంత చోరీ సొత్తు గురించి పోలీసులు గాలిస్తున్నారని ఎస్ఐ తెలిపారు.

అరసాడలో గడ్డి కుప్పలు దగ్ధం

బలిజిపేట : మండలంలోని అరసాడలో గుంట్రెడ్డి త్రినాథ, సుబ్బాన కృష్ణ, నడిమింటి కురిమినాయుడుకు చెందిన గడ్డికుప్పలు సోమవారం దగ్ధమయ్యాయి. అగ్నికీలలు పెద్దగా రావడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. సమీపంలో ఉన్న ధాన్యం బస్తాలను దూరంగా విసిరివేయడంతో కొంతమేరకు ఆస్తినష్టం తప్పింది. బొబ్బిలి, పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. రాత్రి 9గంటల వరకూ ఆర్పుతున్నారు. సుమారు రూ.4లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించవచ్చునని స్థానికులు అంచనా వేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో గ్రామంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.



దగ్ధమవుతున్న గడ్డి కుప్పలు